క్లుప్తంగా

30న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని 30న నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు తెలిపారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ల నియామకం



తెనాలి: ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పట్టణ కన్వీనర్లుగా స్థానిక నందులపేటకు చెందిన షేక్ నాఫీజ్, బాలాజీరావుపేట నివాసి షేక్ దావూద్ నియమితులయ్యారు. చినరావూరులోని కార్యాలయంలో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీల్ శుక్రవారం వీరికి నియామకపత్రాలను అందజేశారు. ముస్లిం సోదరుల అభివృద్ధికి అంతా కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

శిలాఫలకం ఆవిష్కరణ



తెనాలిటౌన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తెనాలి మండల పరిషత్ కార్యాలయ పాలక మండలి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరణ గావించారు. 2021 సెప్టెంబర్ 24న పాలకమండలి ఏర్పాటు అయినట్లు ఎంపీపీ చెన్నకేశవులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో వైవిడి ప్రసాద్, వైస్ ఎంపీపీలు కోడూరి స్వప్న, గోపిశెట్టి రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కారు బోల్తాపడి నలుగురికి గాయాలు

కొల్లిపర: ప్రమాదవశాత్తు కారు పల్టీ కొట్టి నలుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం హనుమాన్‌పాలెం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని దావులూరిపాలెం గ్రామానికి చెందిన ఏమినేని కార్తీక్, ఏమినేని జగదీష్, దొంతగాని గోపి, దొంతగాని శివశంకర్‌లకు గాయాలయ్యాయి. వీరు దావులూరుపాలెం నుండి కృష్ణానది కల్వకట్టపై రేపల్లెకి వెళ్తుండగా హనుమాన్‌పాలెం దగ్గరలో ప్రమాదవశాత్తు రేపల్లె కెనాల్ కాలువలో కారుదూసుకుపోయి పల్టీకొట్టింది. గాయపడిన వారిని స్థానికులు వెంటనే 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అంగలకుదురులో విద్యార్థికి ఆర్థిక సాయం



తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలో వివేక మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న దుర్గారెడ్డి అనే విద్యార్థికి బీజేపీ నేతల సహకారంతో ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థి తల్లి నాగలక్ష్మికి దాత గుత్తా రాజ్యలక్ష్మికి చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కె.వాసుదేవ నాయుడు, మండల పరిషత్ కడియాల నందకిషోర్, పార్టీ సీనియర్ నాయకులు ఎం.వీరయ్య, ఎం.జనార్థన్ పాల్గొన్నారు.

నోటుబుక్స్, జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహా వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం జన్మదినాన్ని పురస్కరించుకుని సత్యనారాయణ టాకీస్ రోడ్డులోని మున్నీ మస్తాన్ మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు నోట్, డ్రాయింగ్ బుక్స్, జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిల్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ నేరెళ్ళ వెంకట కృష్ణ మోహనరావు మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అయినాల మల్లేశ్వరరావు, కోణిజేటి రమేష్‌కృష్ణ, నంబూరు శ్రీకుమార్ పాల్గొన్నారు.

అధికారులపై ప్రశ్నల వర్షం

- అజెండాలో కనపడని అభివృద్ధి అంశాలు
- మొక్కుబడిగా మూడు నెలలకు ఒకసారి సాధారణ సర్వ సభ్య సమావేశం
- మౌనమునిలా ఎంపీపీ
- సభ్యుల ప్రశ్నలకు మొక్కుబడి సమాధానాలిచ్చిన అధికార యంత్రాంగం
- రసాభాసగా మారిన తెనాలి మండల పరిషత్ సమావేశం





హాజరైన సభ్యులు. సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చెన్నకేశవులు

తెనాలిటౌన్: స్థానిక కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మూడునెలలకు ఒకసారి మొక్కుబడిగా సమావేశం నిర్వహిస్తున్నారని సభ్యులు అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశపు అజెండాలో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా అభివృద్ధికి సంబంధించిన అంశాలు మచ్చుకైన పొందుపరచలేదు. కేవలం సమావేశపు అజెండా పేరుతో ఖాళీ పేపరును సభ్యులకు అందజేశారు.

సమావేశం ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే సభ్యులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, పారిశుద్ధ్య నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుల ప్రశ్నలకు ఎంపీపీ, ఎంపీడీవోల నోటి నుంచి కనీసం సమాధానం లేదు.

మొక్కుబడి సమావేశాలు ఎందుకని సభ్యులు విరుచుకుపడ్డారు. ఏదైనా సమస్య లిఖితపూర్వకంగా ఇస్తే పరిష్కరిస్తామని, ఇప్పటికిప్పుడు ప్రశ్నించడం వలన ఫలితం ఉండదని ఎంపీడీవో అత్తోట దీప్తి సమాధానం ఇచ్చారు. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు, కుక్కల బెడదలు అధికంగా ఉందని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకురాగా త్వరలో పరిష్కరిస్తామని విద్యుత్ ఏఈ వెంకట్రావు సమాధానం ఇచ్చారు. కుక్కల బెడదను అరికడతామని ఎంపీడీవో తెలిపారు. పట్టణంలో పట్టుకువచ్చిన కుక్కలను గ్రామాల్లో వదులుతున్నారని పలువురు సభ్యులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. ఏ గ్రామంలో ఎన్ని వర్కులు పెట్టారు, గత అజెండాలో పొందుపరచిన అంశాలు పరిష్కారానికి నోచుకున్నాయా అన్నది అక్కడి సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లకు అర్థం కాని మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. మొక్కుబడి సమావేశాలతో అభివృద్ధిని మమః అనిపిస్తున్నారని కొలకలూరు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు కాలిశెట్టి ఫణీకుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అక్రమణలకు గురైన డొంకలు, విద్యుత్ సమస్యను పరిష్కరించామని ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చిన అధికారుల్లో చలనం లేదని సమావేశ మందిరంలో ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల కోసం పనిచేయాల్సిన అధికార యంత్రాంగం కనీసం ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తమకు కూడా సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. గుడివాడ ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు గ్రామంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా వర్షాకాలం పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలని, కోపల్లె, గుడివాడ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కఠెవరం సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ లైన్‌మేన్ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని విద్యుత్ కోతలు అధికంగా ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని విద్యుత్ రూరల్ ఏఈ వెంకట్రావు హామీ ఇచ్చారు. ఇంత జరుగుతుంటే ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు సభ్యుల సమస్యలు మినిట్స్ బుక్‌లో నోటు చేసి సంబంధిత శాఖకు బదలాయించి పరిష్కరించమనే ఆలోచన ఏ మాత్రం చేయడం లేదని పలువురు సభ్యులు వాపోతున్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని అంటున్నారు. ఎంపీపీ మౌనంగా ఉండటం వలన అధికారులు సమస్యలను కనీసం నోటు చేసుకోకుండా గాలికి వదిలిస్తున్నారన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, ఏపీఎం జయశ్రీ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఖాళీ అజెండా

ప్రకృతి వ్యవసాయాన్ని సందర్శించిన 'గేట్స్' ప్రతినిధి



ప్రకృతి వ్యవసాయ మహిళా రైతులతో శైలేంద్ర

దావులూరుపాలెం(తెనాలి): ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'గేట్స్' ఫౌండేషన్ ప్రతినిధి శైలేంద్ర శుక్రవారం కొల్లిపర మండలంలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించారు. తొలుత దావులూరుపాలెం గ్రామంలో మహిళా రైతు శ్రీలక్ష్మి అనుసరిస్తున్న సూర్యమండలం మోడల్‌ను, బ్యాక్‌యార్డు పౌల్ట్రీని పరిశీలించారు. వారి కుటుంబ ఆహార పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ధనలక్ష్మి మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశమై, ఫుడ్ బాస్కెట్, న్యూట్రీ గార్డెన్లలో భాగస్వామ్యంపై చర్చించారు. మహిళలు తమ అనుభవాలను, ఆహార పద్ధతులను తెలియచేశారు. రైతు ధూళారి పృథ్వి మౌలికంగా ఏర్పాటు చేసిన ఏటీఎం మోడల్‌ను సందర్శించారు. రైతు వినూత్నంగా చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించిన వైలేంద్ర వాటిపై ఎంతో ఆసక్తిని కనబరిచారు. కార్యక్రమంలో ముకేష్, హెల్త్–న్యూట్రీషన్ సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీ దుర్గ, డీఎల్ఎంపీ సత్యనారాయణ, ఎస్ఎఫ్ఏ నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కుమారి

తెనాలిటౌన్: జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా వేతనాలు పెరగక అంగన్‌వాడీ వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చకపోవడం వలన అంగన్‌వాడీలు ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో యూనియన్ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, సునీత, రంగ పుష్ప, కళాధరి, రజియాబేగం, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



డీఎస్పీ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న రవి, కేవీపీఎస్ నాయకులు, బాధిత మహిళలు

తాడికొండ: తుళ్లూరు మండలం మందడం గ్రామంలో ఏపీ సచివాలయానికి కూతవేటు దూరంలో ఎస్సీ కాలనీకి మంచినీరు అందడం లేదంటూ నిరసన తెలిపిన మహిళలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. ఈ మేరకు శుక్రవారం మందడంలోని తుళ్లూరు డీఎస్పీ కార్యాలయంలో ఆయనను బాధిత మహిళలతో కలిసి విజ్ఞప్తి చేశారు. అయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీన దళిత మహిళలు మంచినీరు ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేసిన సందర్భంగా పోలీసులు కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. కృష్ణానది చెంతనే ఉన్నా రాజధాని అమరావతిలో మందడంతో పాటు పలు గ్రామాల్లో మంచినీటి సమస్య ఉండడం బాధాకరమన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్పందించి రాజధాని గ్రామాల్లో మంచినీటి సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రాజధాని గ్రామాల తాగునీటి సమస్యల పరిష్కారానికి సీఆర్‌డీఏ రూ.10.75 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. తుళ్లూరులో నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకు వెంటనే పూర్తి చేసి నేలపాడు, శాఖమూరు గ్రామాలకు రాజధాని కోర్ క్యాపిటల్ పైపులైన్ నుంచి తాగునీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీ కృష్ణను కలిసి కేసులు ఎత్తివేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాజధాని డివిజన్ కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు నియంత్రించాలంటూ వినతి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఇంటర్మీడియ్ ప్రాంతీయ కార్యాలయం అధికారికి పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం వినతిప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ధనార్జనే ధ్యేయంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తుల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారని.. ఒక బ్రాంచ్‌కు పర్మిషన్ తీసుకుని అనేక బ్రాంచ్‌లలో క్లాసులు నిర్వహిస్తున్నారని అన్నారు. పైఅంశాలను వివరిస్తూ ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి(ఆర్ఐఓ)కు వినతి పత్రం అందజేశామని, సానుకూలంగా స్పందించిన అధికారి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయి మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని 10,11 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట పలు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు



కొల్లిపర: ప్రస్తుతం రైతులు మాగాణి భూమిలో వరి వెద పద్ధతి పై పెడుతున్న సందర్భంగా రైతులకు సబ్సిడీపై వరి బిపిటి 5204 విత్తనాలను సబ్సిడీపై రైతు సేవా కేంద్రంలో అందిస్తున్నట్లు ఏవో ఎస్.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 కేజీల బస్తా ధర 1075 గా మార్కెట్లో ఉండగా సబ్సిడీపై రైతుకు రూ.950 లు అందిస్తున్నట్లు తెలిపారు. వరి విత్తనాలు కావలసిన రైతులు వారి పరిధిలోనే రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బందిని కలిసి తగిన పత్రాలను అందజేసి వరి విత్తనాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమవరపు కిషోర్‌రెడ్డి రైతులు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

చలో తెనాలి కరపత్రాలు పంపిణీ

తాడేపల్లి రూరల్: శనివారం(నేడు) నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేక అమరారెడ్డినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. న్యాయస్థానాలు ఎన్నిమార్లు చెప్పినా పోలీసుల తీరు మారడం లేదని అన్నారు. ఈ దుశ్చర్యను ఖండించకపోతే భవిష్యత్తులో తెనాలి సంఘటనలు మరల జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, కె.బాబూరావు, బర్నబాస్, దుర్గారావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

తాడికొండ: మందడం ఎస్సీ కాలనీ మహిళల సుదీర్ఘ పోరాటం అనంతరం ఎట్టకేలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. గ్రామంలో పైపులైన్‌లు లీకేజీలు ఉన్న కారణంగా నీరు పూర్తిగా కలుషితమై ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మహిళలు రోడ్డెక్కారు.

టీబీ వ్యాధిపై అవగాహన

తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు–2 సచివాలయం పరిధిలోని ముక్తి హాస్టల్ విద్యార్థులకు క్షయ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంగం జాగర్లమూడి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ 2030 నాటికి క్షయ వ్యాధి లేని భారతదేశంగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అందులో భాగంగానే క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రెండు వారాల మించి దగ్గు, రెండు వారాలు మించి జ్వరం, బరువు తగ్గిపోవటం, ఆకలి లేకపోవడం, అలసట రావటం, కళ్లెలో రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తే తెనాలి గవర్నమెంట్ హాస్పటల్ నందు కళ్లెపరీక్ష చేయించుకోవాలని, ఛాతి ఎక్స్–రే తీయించుకోవాలని సూచించారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా క్షయ నివారణ అధికారుల సూచన మేరకు టీబీ ముక్త భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ సర్వే కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగలకుదురు–2 ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు సమాధానం, అమూల్య, ముక్తి హాస్టల్ ఫాదర్ మార్ట్, మైఖేల్, సిబ్బంది రవీంద్ర, భార్గవి, సుమలత, ఆనంద్ రాజ్, గౌతం పాల్గొన్నారు.

దైవ సేవకులు ఐక్యతతో జీవించండి



బిషప్ సుధీర్‌కుమార్, జాన్ సేల్విన్‌లను సన్మానిస్తున్న పాస్టర్లు

తెనాలిఅర్బన్: దైవసేవకులందరూ ఐక్యతతో జీవించాలని ది తెనాలి టౌన్ పాస్టర్స్ అండ్ గాస్పల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూచిపూడి అబ్రహాం పేర్కొన్నారు. ఐతానగర్ ప్యాడిసన్‌పేటలోని ఈరే న్యూలైఫ్ ఫ్యామిలీ వర్షిప్ చర్చిలో కృతజ్ఞత ఆరాధన కూడికను శుక్రవారం నిర్వహించారు. ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని తెనాలి చేరుకున్న ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ కత్తెర సుధీర్‌కుమార్, ఆయన కుమారుడు బిషప్ జాన్ సెల్వీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెనాలి పరిధిలోని వివిధ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు రెవరెండ్ ఎ.భానుప్రసాద్, రెవరెండ్ సర్వోన్నతరావు, పాస్టర్‌లు బర్నబాస్, పల్లె శ్యాముల్, జె.ప్రభుదాసు, చిలకా జాన్ వరప్రసాదరావు, మర్రిపూడి జాన్‌బాబు, యనమాల ఈశ్వర్, మార్టిన్ లూథర్‌బాబు, కారుమూరి జక్రయ్య, బ్రదర్ ఆనందన్న, కృపాదానం, డేవిడ్, గిద్యోనుపాల్గొన్నారు.

నేటి నుంచి 'రథ్ ఫెస్ట్ 2025'



ఇస్కాన్ టెంపుల్‌లో స్వామివారు

తెనాలి: 'ఇస్కాన్' టెంపుల్, తెనాలి ఆధ్వర్యంలో 2025 సంవత్సర రథోత్సవం (రథ్ ఫెస్ట్–2025)లో భాగంగా 'జిజ్ఞాస' సంస్థ సహకారంతో వివిధ సాంస్కృతిక అంశాల్లో రెండురోజుల పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొత్తం 51 అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. సంగీతం, భగవద్గీత, చిత్రలేఖనం, పెయింటింగ్, క్రాఫ్ట్ పోటీలు శనివారం, నృత్యం, ఏకపాత్ర, క్విజ్, ఫ్యాన్సీ డ్రెస్, క్రియేటివ్ స్పీకింగ్ క్రియేటివ్ రైటింగ్ వంటి పోటీలను ఆదివారం నిర్వహిస్తారు. శ్రీకృషణుడు, విష్ణుమూర్తి, వైష్ణవానికి సంబంధించిన అంశాలను ప్రదర్శించవచ్చని ఫెస్ట్ క్యూరేటర్ రోహిణి వైష్ణవి ఒక ప్రకటనలో తెలియజేశారు. అయిదేళ్ల నుండి 29 ఏళ్ల వయసు కలిగిన ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సాంస్కృతిక పండుగకు రాష్ట్ర నలుమూలల నుంచి 1,000 మంది నమోదు చేసుకున్నారని, ఇంకా ఎవరికైనా ఆసక్తి ఉంటే వైకుంఠపురం ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచండి

ఎంపీడీవో అత్తోట దీప్తి



బుర్రిపాలెంలో పర్యటిస్తున్న ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ఎంపీడీవో అత్తోట దీప్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం దోమల బెడద, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున గ్రామంలో శానిటేషన్ మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు రోడ్లపై చెత్త చెదారం వేయవద్దని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు తడి చెత్త, పొడి చెత్తను సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఇటీవల ముగ్గురు చిన్నారులను వీధికుక్కలు కరిచినట్లు గ్రామస్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం గ్రామంలో కుక్కల బెడదను అరికట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవిడి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తెనాలిలో మానవ హక్కుల పరిరక్షణ సదస్సు

కన్వీనర్ పిల్లి విద్యాసాగర్



కరపత్రం ఆవిష్కరణలో విద్యాసాగర్, వినయ్‌కుమార్, ప్రభాకర్

తెనాలి: పట్టణ పోలీసుల మానవ హక్కుల ఉల్లంఘనను ప్రతిఘటిస్తూ శనివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక అయితానగర్‌లోని పొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాలులో జరగనున్న 'మానవ హక్కుల పరిరక్షణ సదస్సు' వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్టు సదస్సు కన్వీనర్, ప్రముఖ న్యాయవాది పిల్లి విద్యాసాగర్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం డీబీఎఫ్ అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాది బేతాళ ప్రభాకర్ రావు, రాష్ట్ర దళిత నాయకుడు గెడ్డటి సుందర్ సునీల్ కుమార్, టీబీఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్ కుమార్, న్యాయవాది పొందుగల ప్రకాష్‌లతో కలిసి సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. సదస్సులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర నాయకుడు జల్లి విల్సన్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు, దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని వివరించారు. సదస్సును జయప్రదం చేయాలని విద్యాసాగర్ కోరారు.

బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ ఆరోగ్యాధికారి



ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావును మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ యేసుబాబు

తెనాలిఅర్బన్: మున్సిపల్ ఆరోగ్యాధికారిగా డాక్టర్ ముప్పా యేసుబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అమృతలూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యునిగా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై తెనాలి వచ్చారు. మూడేళ్ళపాటు తెనాలి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా పని చేయనున్నారు. గతంలో హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ కె.హెలెన్ నిర్మల తన డిప్యూటేషన్ పదవికాలం పూర్తివడంతో వైద్య ఆరోగ్యశాఖకు వెళ్లిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన యేసుబాబు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను, ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావులను మర్యాదపూర్వకంగా కలిశారు.